KANCHARLA
# మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

## తెలంగాణ

హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం

బుధవారం 15 ఏప్రిల్ 2026 పేజీ : 1

## ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా?

- రేవంత్ వ్యాఖ్యలు అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధం
- ఇందిర, రాహుల్, ప్రియాంక ఎక్కడి నుంచి వచ్చారు?
- ఉత్తరాది, దక్షిణాది అంటూ విద్వేషాలు వద్దు
- లక్ష్మణ్ వలసవాది అయితే గాంధీ కుటుంబం ఏంటి?
- రేవంత్ అద్దాల మేడలో కూర్చుని రాళ్లు వేస్తున్నారు
- ఢిల్లీ మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధ్వజం



03



## దేశానికి గాంధీ, అంబేద్కర్
# రెండు కళ్లు

**బలమైన దేశ నిర్మాణానికి బాబాసాహెబ్ కృషి అనన్యం**

- గత పాలనలో దళిత నేతలకు అన్యాయం
- ఉన్నత పదవుల్లో బహుజనులను చూసి ఓర్వలేకపోతున్నారు
- దక్షిణాదిపై కేంద్రం సవతి తల్లి ప్రేమ..
- డిలిమిటేషన్ పేరుతో తెలంగాణకు తీరని ద్రోహం
- మహిళా రిజర్వేషన్ల ముసుగులో కొత్త రాజకీయం
- పదేళ్ల విధ్వంసం సరిదిద్దుతూ రాష్ట్ర పునర్నిర్మాణం
- సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 2లో..



## అంబేద్కర్ మార్గంలోనే
# తెలంగాణ సాధన

బాబా సాహెబ్ కు నిజమైన గౌరవం ఇచ్చింది కేసీఆర్

**విగ్రహానికి సంకెళ్లు వేసిన ఘనత కాంగ్రెస్ దే**



- గురుకులాల్లో ఆగని విద్యార్థుల మరణాలు
- దళిత బంధు ఆపి అవమానిస్తున్నారు
- కాంట్రాక్టుల్లో బహుజనులకు దక్కిందేమిటి?
- ఏప్రిల్ 20న జగిత్యాలలో కేసీఆర్ గర్జన
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

03



## సమ్మె నిర్ణయాన్ని విరమించుకోండి

**ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి**

- చర్చలకు మా తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి
- ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మె వద్దు
- విలీనం, ఎన్నికల అంశాలు ప్రభుత్వ పరిధిలోనే



వివరాలు 2లో..

## అజ్ఞాతంలో కేవలం
# నలుగురే

**మావోయిస్టులపై తెలంగాణ పోలీసు శాఖ తాజా నివేదిక**

- గణపతి, సంతోష్ సహా నలుగురిపైనే నిఘా
- జనజీవన స్రవంతిలోకి రావాలని డీజీపీ విజ్ఞప్తి

వివరాలు 2లో..

## అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ కాంగ్రెస్



- రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన
- బీజేపీ కంటే కాంగ్రెస్‌కే ఘనమైన చరిత్ర
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

06

## మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం



- మహిళా సాధికారతకు వీ-హబ్ వేదిక
- ప్రతి ఇంటికీ టీ-ఫైబర్ ఆధునిక విద్య
- ఏఐ, రోబోటిక్స్ శిక్షణతో ఉపాధి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

03

## బీఆర్ఎస్ పాలనలో లక్షల కోట్ల దోపిడీ

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



05

# అజ్ఞాతంలో కేవలం నలుగురే

## తెలంగాణ పోలీసు శాఖ తాజా నివేదిక

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** తెలంగాణకు చెందిన నలుగురు మావోయిస్టులు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని రాష్ట్ర పోలీసు శాఖ వెల్లడించింది. కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి, పసునూరి అలియాస్ నరహరి అలియాస్ సంతోష్, స్టేట్ కమిటీ సభ్యులు జడే రత్నాబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగులు అజ్ఞాతంలో ఉన్నట్లు వివరించింది. సాయుధ పోరాటం విరమించి జనజీవన స్రవంతిలో కలవాలని ఇప్పటికే డీజీపీ పిలుపునిచ్చారు. ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే ప్రయోజనాలు పొందాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది. మరోవైపు సోమవారం కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాల కూంబింగ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో ఎల్ సీ కమాండర్ రూపూ రెడ్డి అలియాస్ రంగబోయిన భాగ్య (46) మరణించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ఈమె స్వస్థలం. రెండు దశాబ్దాలుగా ఈమె అజ్ఞాతంలో ఉంటున్నారు. మూడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్ గా ఉన్న రూపూ రెడ్డిపై రూ. 5 లక్షల రివార్డు ఉంది. మృతదేహానికి ఇప్పటికే పోస్టుమార్టం పూర్తయింది. మంగళవారం సాయంత్రం ఈ మృతదేహం స్వగ్రామానికి చేరుకోనుంది. బుధవారం రూపూ రెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వడదెబ్బతో ఆరోగ్య సమస్యల ముప్పు
- గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
- కూలీలకు తాగునీటి వసతి కల్పించాలి
- బయటకు వెళ్తే టోపీలు తప్పనిసరిగా ధరించాలి
- మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** రాష్ట్రంలో ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతోంది. ఉదయం 9 దాటితే బయటకు రావడం కష్టంగా మారింది. ఎండల్లో బయటకు రావొద్దని ప్రజలకు తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. బయటకు వస్తే టోపీ, తలపాగా తప్పనిసరిగా ధరించాలని దిశానిర్దేశం చేశారు. వడదెబ్బ తగిలితే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు.

### అధికారులకు కీలక ఆదేశాలు

అధికారులు గ్రామాలు, పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ స్థాయిలో తాగునీటి సౌకర్యాలను కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ కార్మికులకు ప్రత్యేక సూచనలు చేశారు. పనిస్థలాల్లో తాగునీటి వసతి ఏర్పాటు తప్పనిసరని తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పని చేసే ప్రాంతాల్లో ఆయా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్మికుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లు

- గత పాలనలో దళిత నేతలకు అన్యాయం
- పదేళ్ల విధ్వంసం సరిదిద్దుతూ రాష్ట్ర పునర్నిర్మాణం
- సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** దేశానికి మహాత్మా గాంధీ, డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ రెండు కళ్ల వంటి వారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంత కీలకమో, దేశాభివృద్ధిలో అంబేద్కర్ పాత్ర కూడా అంతే విశిష్టమని పేర్కొన్నారు. ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆ ఇద్దరు మహాత్మా గాంధీ, అంబేద్కర్ దేశానికి రెండు కళ్ల వంటి వారని అన్నారు. రక్తం చిందించకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపిస్తే, బలమైన దేశంగా భారత్ ఎదిగేందుకు అంబేద్కర్ అహర్నిశలు కృషి చేశారని చెప్పారు. ప్రజల కలలు సాకారం చేసే దిశగా తమ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పోషించిన పాత్రను ఎవరూ మర్చిపోలేరని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### ఓర్వలేకపోతున్న ప్రతిపక్షాలు

గత ప్రభుత్వ కేబినెట్ లో దళితులకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ కేబినెట్ లో దళితులకు సముచిత స్థానం కల్పించామని స్పష్టం చేశారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. గతంలో భట్టి విక్రమార్క సీఎల్పీ నేతగా ఉన్న సమయంలో ఆ పదవిని తొలగించేందుకు కుట్రలు జరిగాయని ఆరోపించారు. ఎస్సీ నాయకుడు స్పీకర్ గా, ఆర్థిక మంత్రిగా ఉండకూడదా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో డైట్ ఛార్జీలు ఎప్పుడైనా పెంచారా అని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కడుతుంటే కొందరు తట్టుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు.

### కేంద్రం తీరుపై ధ్వజం

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. నియోజకవర్గాల విభజనలో కేవలం జనాభాను ప్రాతిపదికగా తీసుకోవడం సరికాదన్నారు. కేంద్ర ఆదేశాల మేరకు కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల దక్షిణాదిలో జనాభా తగ్గిందని, దీనివల్ల పార్లమెంట్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాదికి నష్టం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. అందుకే 50 శాతం జనాభా, మరో 50 శాతం జీఎస్డీపీ ఆధారంగా హైబ్రిడ్ మోడల్ లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని కేంద్రానికి డిమాండ్ చేశారు.

### విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్రంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానాన్ని తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ కొత్త విద్యా విధానం తో పాటు ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుతో పేద పిల్లల చదువుల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని నమ్మకం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే 67 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. ఈ ఉద్యోగాల్లో 87 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకే దక్కాయని వివరించారు. గత పదేళ్ల విధ్వంసం రాష్ట్రానికి వందేళ్ల నష్టాన్ని మిగిల్చిందని విమర్శించారు. పాత అప్పులు చెల్లిస్తూనే గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతూ పాలనను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించారు

# మంత్రి పొంగులేటి ఇంట నేతల ముచ్చట

- మంత్రి నివాసంలో ఆత్మీయ కలయిక
- తేనీటి విందులో భట్టి, మహేష్ గౌడ్



**ఖమ్మం, ఏప్రిల్ 14 (మనసులో మాట):** మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసం మంగళవారం ఆత్మీయ కలయికకు వేదికైంది. మంత్రి ఆహ్వానం మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆయన గృహానికి విచ్చేశారు. ముఖ్య నేతలందరూ ఒకే చోట చేరి తేనీటి విందును ఆస్వాదిస్తూ సరదాగా ముచ్చటించారు. పండుగ వాతావరణంలో ఈ సమావేశం సాగింది. ఈ భేటీలో ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. ప్రముఖ నేతల రాకతో మంత్రి నివాసంలో కోలాహలం నెలకొంది. అందరూ కలిసి కాసేపు సరదాగా గడిపారు.

# సమ్మె నిర్ణయాన్ని విరమించుకోండి

## ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** ఆర్టీసీ పరిరక్షణ, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ లో మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని సంస్థ కార్మికులకు పిలుపునిచ్చారు. సమస్యలు చెప్పుకోవడానికి తమ తలుపులు తెరిచే ఉన్నాయని, ఎవరైనా వచ్చి తమ బాధలు చెప్పుకోవచ్చని సూచించారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల అంశాలు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. విలీనానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ వేగంగా పని చేస్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### సమ్మెకు సిద్ధమైన జేఏసీ

తమ డిమాండ్లు నెరవేరని పక్షంలో ఏప్రిల్ 22 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ సోమవారం ప్రకటించింది. 21వ తేదీ అర్ధరాత్రి నుంచే బస్సులను నిలిపివేస్తామని స్పష్టం చేసింది. 22వ తేదీ తెల్లవారుజాము నుంచి పూర్తిస్థాయిలో సమ్మెలోకి వెళ్తామని పేర్కొంది. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశమయ్యారు. అనంతరం జేఏసీ నేతలు మాట్లాడుతూ ఈ సమావేశానికి ఆర్టీసీ సంస్థ నుంచి అధికారులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం యాజమాన్యం నుంచి ఒక లేఖ మాత్రమే వచ్చిందని చెప్పారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని యాజమాన్యం తన లేఖలో స్పష్టం చేసిందని జేఏసీ నేతలు తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం సహా మరో 30 డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం స్పందిస్తూ కార్మికులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ప్రభుత్వ సానుకూలతను గమనించి సమ్మె ఆలోచన విరమించుకోవాలని సూచించారు.

# అంబేడ్కర్ మార్గంలోనే తెలంగాణ సాధన

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ పోరాడితే పోయేదేమీ లేదని అంబేద్కర్ చెప్పిన మాటలు నిజమయ్యాయని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ 125 అడుగుల విగ్రహానికి సంకెళ్లు వేసి బందీ చేసిందని ఆరోపించారు. తాము పోరాడతామని చెప్పిన వెంటనే భయపడి విగ్రహాన్ని తెరిచారని వ్యాఖ్యానించారు. అంబేద్కర్ చూపిన సిద్ధాంతంతోనే కేసీఆర్ తెలంగాణ సాధించారని చెప్పారు.



### గురుకులాల్లో మరణ మృదంగం

ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో గురుకులాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ మరణ మృదంగం మోగుతోందని, విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను రాజకీయ అవసరాలకు వాడుకుంటోంది తప్ప నిజమైన గౌరవం ఇవ్వలేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్నన్ని ఏళ్లు అంబేద్కర్‌కు భారత రత్న ఇవ్వలేదని గుర్తుచేశారు. అంబేద్కర్ అభయ హస్తం, దళిత బంధు పథకాలను నిలిపివేసి ఆయనను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత బంధు తెచ్చిన ధైర్యం ఉన్న నేత కేసీఆర్ అని కొనియాడారు.

### కాంట్రాక్టుల్లో బహుజనులకు దగా

ఎస్ సీ, ఎస్ టీ, బీ సీలకు కాంట్రాక్టుల్లో అవకాశాలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. లక్షన్నర కోట్ల కాంట్రాక్టుల్లో బహుజనులకు వాటా ఇచ్చారా అని ప్రశ్నించారు. మూసీ కాంట్రాక్టులు వీరికి ఇస్తారా అని నిలదీశారు. కాంగ్రెస్ మోసాలను ప్రతి ఇంటికీ వివరించి పోరాడాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని తాము అసెంబ్లీలో తీర్మానం చేశామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలకు అంబేద్కర్ అంటే గిట్టదని విమర్శించారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో జరిగే సభకు కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. జై భీమ్, జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాలతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా?

## ఢిల్లీ మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధ్వజం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (మనసులో మాట):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బంట్రోతు పోస్టు దొరకదని రేవంత్ అంటున్నారని, అంటే ప్రజలను ఆయన బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభజన తీసుకొచ్చేలా రేవంత్ మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి తప్పుడు మాటలు మాని వాస్తవాలు మాట్లాడాలని సూచించారు. ఆయన వ్యాఖ్యలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి వితండవాదాలు పక్కన పెట్టాలని కిషన్ రెడ్డి హితవు పలికారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు.

### తెలుగు ఆత్మగౌరవం - గాంధీ కుటుంబం



కాంగ్రెస్ కు వ్యతిరేకంగా పుట్టిన పార్టీ టీడీపీ అని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం టీడీపీ పుట్టిందని ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఉప రాష్ట్రపతులుగా ఉన్నారని, వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా పని చేశారని చెప్పారు. తాను ఒక్కడినే మేధావిని అని అనుకుంటూ అద్దాల మేడలో కూర్చుని రేవంత్ రెడ్డి రాళ్లు వేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడి నుంచి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. దేశం మొత్తం ఒకటి కాదా అని నిలదీశారు. లక్ష్మణ్ వలస పోయారని రేవంత్ అంటున్నారని, మరి ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడి నుంచి పోటీ చేశారో రేవంత్ కు తెలియదా అని నిలదీశారు. రాహుల్ గాంధీ బుద్ధితో కాంగ్రెస్ నడుస్తుంటే, రేవంత్ రెడ్డి డబ్బులతో నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ కాంగ్రెస్ కు అధికారిక కోశాధికారిలా పని చేస్తున్నారని సెటైర్లు వేశారు.

### డీ లిమిటేషన్ - సీట్ల కేటాయింపు

డీ లిమిటేషన్ తో ఎన్ని సీట్లు పెరుగుతాయనేది పార్లమెంట్ సమావేశాల్లో తెలుస్తుందని కిషన్ రెడ్డి చెప్పారు. రేవంత్ రెడ్డి హైబ్రిడ్ మోడల్, జీడీపీ పరంగా సీట్లు పెరగాలని అంటున్నారని, ప్రపంచంలో ఇది ఎక్కడా లేదని కొట్టిపారేశారు. అటువంటప్పుడు అసెంబ్లీ సీట్లు ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో తగ్గిస్తారా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేవలం హైదరాబాద్ లోనే సీట్లు పెంచుతారా అని నిలదీశారు. 70 శాతం రెవెన్యూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచే వస్తోందని తెలిపారు. దేశంలో రాహుల్ గాంధీ తర్వాత అంతటి మేధావి రేవంత్ రెడ్డే అని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.



# విద్య, వైద్యమే మా ప్రాధాన్యం

## మొదటి విడతలో 70 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

## చెన్నూరులో స్కూల్‌కు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

**సత్తుపల్లి, ఏప్రిల్ 14 (మనసులో మాట):** కాగితాలు, శిలాఫలకాలకే పరిమితం కాకుండా పనులను చిత్తశుద్ధితో పూర్తి చేసే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ మొదటి విడతలో 70 నియోజకవర్గాల్లో సుమారు 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలం చెన్నూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అందిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశించిన స్థాయిలో లేకపోయినా అభివృద్ధిలో రాజీ పడకుండా ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. పేదలకు ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చడంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత కరెంట్, రేషన్ కార్డులు, నిరుద్యోగులకు 72 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు మంత్రి పొంగులేటి వివరించారు. రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, సన్నవడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని గుర్తుచేశారు. త్వరలో సత్తుపల్లి నియోజకవర్గంలో మూడు పెద్దాసుపత్రులు రాబోతున్నాయని ప్రకటించారు. కల్లూరును నియోజకవర్గం చేసే అంశం పూర్తిగా కేంద్రం పరిధిలోని పునర్విభజన సమీకరణలపై ఆధారపడి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణాల కోసం భూమి కోల్పోయిన వారికి మరోచోట భూమి ఇస్తామని, ఆ బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. రోడ్ల పనులను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ చైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం

## మహిళా సాధికారతకు వీ-హబ్ వేదిక

## ప్రతి ఇంటికీ టీ-ఫైబర్ ఆధునిక విద్య

## ఏఐ, రోబోటిక్స్ శిక్షణతో ఉపాధి

## నైపుణ్యాభివృద్ధికి టాస్క్ సెంటర్లు

## విదేశీ ఎగుమతులకు పక్కా బ్రాండింగ్

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



**పెద్దపల్లి, ఏప్రిల్ 14 (మనసులో మాట):** మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం పెద్దపల్లి పట్టణంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి వీ-హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సాధికారతకు వీ-హబ్ ఒక శక్తివంతమైన వేదికగా నిలుస్తుందన్నారు. మహిళలు చిన్న వ్యాపార యూనిట్లు ప్రారంభించి సీఈఓ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. టీ-ఫైబర్ ద్వారా ఆధునిక విద్యను ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. భవిష్యత్తులో ఏఐ, రోబోటిక్స్ రంగాలు యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు.

### నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

ప్రస్తుతం మంచి చదువు ఉన్నా ఉద్యోగాలు రాకపోవడం ప్రధాన సమస్యగా మారిందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. దీనికి పరిష్కారంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. హైదరాబాద్ తర్వాత తొలి టాస్క్ సెంటర్ పెద్దపల్లిలోనే ప్రారంభించామని, ఇక్కడ శిక్షణ పొందిన వారు మంచి వేతనాలతో ప్రైవేట్ ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. గతంలో మహిళలను లక్షాధికారులుగా చేశామని, ఇప్పుడు కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. ఎస్ హెచ్ జీ ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో మహిళలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

### మహిళా శక్తికి అండగా ప్రభుత్వం

ప్రభుత్వ విప్ విజయ రమణారావు మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు అపార అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఎస్ హెచ్ జీ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్, బ్రాండింగ్ ఉండాలని సూచించారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన వడ్డీ లేని రుణాల బకాయిలను తమ ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ఏఐ ల్యాబ్ విజయవంతమైందని, త్వరలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ తమ ప్రాంతంలో మరో వీ-హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. చివరగా జిల్లా ఆసుపత్రి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడంపై సిబ్బందిని అభినందిస్తూ, 2026 నాటికి కొత్త భవనాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# విమానాశ్రయాల ఏర్పాటులో రాష్ట్రానికి అన్యాయం

**తెలంగాణపై కేంద్రం వివక్ష**

**ఏపీకి 9.. మనకు ఒక్కటేనా?**

**కిషన్ రెడ్డి, బండి సంజయ్ జవాబు చెప్పాలి**

**సింగరేణి సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడతాం**

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**పెద్దపల్లి, ఏప్రిల్ 14 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ఎటువంటి నిధులు మంజూరు చేయడం లేదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. కొత్త విమానాశ్రయాల ఏర్పాటుపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో 9 విమానాశ్రయాలు ఉంటే.. తెలంగాణకు కేవలం ఒక్కటే ఉండటం కేంద్ర వివక్షకు నిదర్శనమన్నారు. మంగళవారం మంథని పట్టణంలో అంబేద్కర్, శ్రీపాద రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

**కేంద్ర మంత్రులపై విమర్శలు**

కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి తెలంగాణకు ఎన్ని నిధులు కేటాయించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక్కడి నుంచి గెలిచిన కేంద్ర మంత్రులు పార్లమెంట్ లో అమరావతి అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారే తప్ప తెలంగాణ గురించి పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. రామగుండంలో సింగరేణి కార్మికుల కోసం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. దీనిపై పార్లమెంట్‌లో గళం విప్పుతామని స్పష్టం చేశారు.

**కార్మికులకు భరోసా**

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్లు పెంచేందుకు పోరాటం చేస్తామని వంశీకృష్ణ తెలిపారు. అలాగే గత కొన్ని రోజులుగా విద్యుత్ కార్మికులు చేస్తున్న సమ్మె గురించి సీఎం రేవంత్ రెడ్డికి వివరిస్తానని చెప్పారు. వారి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలు

**ట్రివియల్ చాప్టర్ ముఠా గుట్టురట్టు**

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును జూబ్లీహిల్స్ పోలీసులు రట్టు చేశారు. ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్ ద్వారా ప్రకటనలు ఇస్తూ నిరుద్యోగులను నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఓవర్సీస్ కన్సల్టెన్సీని నడుపుతూ గ్రీస్, రొమేనియా దేశాల్లో ఉద్యోగాలంటూ ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడుతున్న ట్రివియల్ చాప్టర్ సంస్థకు చెందిన నిరుపమ, అరుణ్ రాజ్ లను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిరుద్యోగుల నుంచి 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. బాధితులను నమ్మించేందుకు నకిలీ వర్క్ ఆథరైజేషన్ లెటర్లు ఇస్తూ దగా చేస్తున్నారు. లైసెన్స్ లేకుండానే కన్సల్టెన్సీ నడుపుతూ సామాజిక మాధ్యమాల ద్వారా నిరుద్యోగులను ఆకర్షిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కేసులో మరో ఎనిమిది మంది నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ముఠాపై ఇప్పటికే కేపీహెచ్ బీ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పుడు అవి అసలైనవో కాదో అధికారిక పోర్టల్ లో ఏజెంట్ల వివరాలను సరిచూసుకోవాలని నిరుద్యోగులకు పోలీసులు సూచిస్తున్నారు. ఏజెంట్ల మాటలు నమ్మి లక్షలాది రూపాయలు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు.

# ప్రజాస్వామ్య పటిష్టతకు అంబేద్కర్ కృషి

- ఆయన రాజ్యాంగంతోనే ఐక్యంగా దేశం అభివృద్ధి
- 125 అడుగుల విగ్రహానికి రేవంత్ కనీసం పూలమాల వేయరా?
- కాంగ్రెస్ ఎస్సీ డిక్లరేషన్ అమలు ఏది?
- మాజీ మంత్రి హరీశ్ రావు



**సిద్దిపేట, ఏప్రిల్ 14 (మనసులో మాట):** ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉందంటే అది డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తి వల్లేనని ఎంఎల్ఏ తన్నీరు హరీష్ రావు అన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు ముక్కలవుతున్నాయని, అంతర్గత యుద్ధాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భారతదేశంలో 28 రాష్ట్రాలు ఉన్నా దేశం ఒక్కటిగా వర్ధిల్లుతుందంటే దానికి అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే కారణమని చెప్పారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం తడకపల్లిలో బాబాసాహెబ్ విగ్రహాన్ని హరీష్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కొందరివాడు కాదని, అందరివాడని వ్యాఖ్యానించారు.

**ప్రజాస్వామ్య స్ఫూర్తికి నాంది**

చాలా దేశాలు విడిపోతూ అంతర్యుద్ధాలతో సతమతమవుతున్నాయని హరీష్ రావు అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దేశం ఒక్కటిగానే ఉందంటే దానికి అంబేద్కర్ మహాశయుడే కారణమని కొనియాడారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలకు ఓటు హక్కు రావడానికి చాలా దశాబ్దాలు పట్టిందని గుర్తుచేశారు. కానీ మన రాజ్యాంగంలో మహిళలు, పురుషులు, కోటీశ్వరులు, పేదవారు అనే తేడా లేకుండా అందరికీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య స్ఫూర్తికి అంబేద్కర్ నాంది పలికారని తెలిపారు. చాలా పేద కుటుంబంలో జన్మించిన బాబాసాహెబ్ ను చూసి యువత స్ఫూర్తి పొందాలని కోరారు. అణగారిన వర్గాల కోసం ఆయన నిరంతరం కృషి చేశారని చెప్పారు.

**కాంగ్రెస్ తీరుపై విమర్శలు**

దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకాన్ని మాజీ సీఎం కేసీఆర్ తెచ్చారని హరీష్ రావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్ పెట్టి ఏడాదవుతున్నా ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకపోవడంతో మధ్యలోనే చదువులు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎస్సీ కార్పొరేషన్ ను డమ్మీ చేశారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకం ఆగిపోయిందని ఆరోపించారు. సెక్రటేరియట్ కు అంబేద్కర్ పేరు పెట్టామని, దేశంలో ఏ రాష్ట్రం అలా చేయలేదని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆలోచనలతోనే తెలంగాణ వచ్చిందని చెప్పారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ పెడితే, రేవంత్ రెడ్డి కనీసం పూలమాల కూడా వేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ మార్గం సమాజానికి వెలుగుదారి

**ఆశయ సాధనకు కదలాలి: నవజీవన్ రెడ్డి**



**ఎల్బీనగర్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు హయత్ నగర్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హయత్ నగర్ పరిధిలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి, అనుమగల్ హయత్ నగర్, తొర్రూర్ రోడ్ పెద్దమ్మ గుడి సమీపంలో, అంబేద్కర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**సమ సమాజ నిర్మాణమే లక్ష్యం**

ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన మార్గం సమాజానికి వెలుగుదారి అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి అపారమైనదని పేర్కొన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్ సీ మోర్చా నాయకులు పొరంద మహేష్, సీనియర్ నాయకులు సంఘీ అశోక్, జంజ్య నాయక్, సురేష్ రెడ్డి, బాలు నాయక్, శక్తి సింగ్, డివిజన్ ఎస్ సీ మోర్చా అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్, బీజేవైఎం సీనియర్ నాయకులు ఎర్ర ప్రేమ్, బీజేవైఎం అధ్యక్షులు అఖిలేష్, బీజేవైఎం నాయకులు అభిలాష్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.



# నల్గొండను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్గొండ, ఏప్రిల్ 14 (మనసులో మాట):** నల్గొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాలను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా తిప్పర్తి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రూ. 10.75 కోట్ల వ్యయంతో సుందరీకరించిన తిప్పర్తి జంక్షన్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.

**జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు**

ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి ప్రాంతాన్ని మెరుగైన సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బీ చంద్రశేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో లక్షల కోట్ల దోపిడీ

- కవిత ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పాలి
- కేటీఆర్ ఎన్ని పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరు
- అప్పులు చేసి ఫామ్ హౌస్ లో పడుకున్న కేసీఆర్
- రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ కుట్ర
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**ఖమ్మం, ఏప్రిల్ 14 (మనసులో మాట):** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అత్యంత దుర్మార్గమైన పరిపాలన సాగిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటున్నారని, ఆయన చేసేది పాదయాత్ర కాదని, ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ ను క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్ అప్పులు చేసి ఫామ్ హౌస్ లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పాదయాత్రకు ముందు తన చెల్లెలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మాజీ మంత్రి కేటీఆర్ పై మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల కేసీఆర్ హయాంలో ఏం చేశారో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క లెక్కలతో అడుగుతుంటే కేసీఆర్ అండ్ కో సతమతమవుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేత సంతోష్ కుమార్ ఎలా సంతోషంగా ఉన్నారో, మాజీ మంత్రి హరీష్ రావు ఆనందం ఏంటో, వారి దోపిడీ ఎంతో కవిత చెబుతోందని సెటైర్లు వేశారు.

### అనవసర ఆరోపణలపై ఆగ్రహం

పదేళ్ల పాటు దోపిడీకి అలవాటు పడి నేడు పదవులు కోల్పోయి ప్రజల ఆగ్రహానికి గురై విలవిలలాడుతున్నారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. కేటీఆర్ అండ్ కో పిచ్చి మాటలు మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఖమ్మం జిల్లా ఎప్పుడూ కాంగ్రెస్ కు అండగా నిలిచిందని ఉదహరించారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న పీవీ నరసింహా రావు దేశ ప్రధాని అయ్యారని ప్రస్తావించారు.

### పార్టీ బలోపేతమే లక్ష్యం

ఇది ఒక్క కాంగ్రెస్ కే సాధ్యమని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే నేడు తెలంగాణలో అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని తమకు నచ్చినట్లుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే కాంగ్రెస్ అడ్డుకుందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాట ఫలితంగా కుల గణన జరిగిందని ప్రస్తావించారు. కాంగ్రెస్ లో సామాన్య కార్యకర్తలు కీలక పదవులు పొందారని అన్నారు. భట్టి విక్రమార్క చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఉదహరించారు. ఖమ్మం గడ్డపై నిలబడి చెబుతున్నానని, వచ్చే ఎన్నికల్లోనే కాదు ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. చేతనైతే తమ విజయాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తాము నెరవేరుస్తున్నామని తెలిపారు. ఖమ్మం నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని చెప్పారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# మద్యం తాగి వాహనం నడపొద్దు

- మత్తుకు యువత దూరం కావాలి
- అరైవ్ అలైవ్ లో స్పీకర్, కలెక్టర్, ఎస్పీ



**వికారాబాద్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా పోలీసు యంత్రాంగం, రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ పట్టణంలోని యెన్నెపల్లి చౌరస్తాలో భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహం సాక్షిగా ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తామని అధికారులతో కలిసి ప్రజలందరూ రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్కు నివాళులు అర్పించి ఈ కార్యక్రమం ప్రారంభించారు.

### మద్యంతోనే రహదారి ప్రమాదాలు

ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలకు మద్యం సేవించి వాహనం నడపడం ప్రధాన కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూనే మానసిక దృఢత్వంతో బాధ్యతగా వాహనాలు నడపాలని సూచించారు. మారుమూల ప్రాంతాల వరకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచాలని కోరారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అందరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాద రహిత జిల్లా సాధ్యమవుతుందని స్పీకర్ పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడు క్రమశిక్షణతో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు.

### బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక నిఘా

జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నామని, గ్రామ స్థాయిలో కూడా రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ రోడ్డు భద్రతపై సామాజిక చైతన్యం తీసుకురావడంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, డ్రైవర్ల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు చురుగ్గా పాల్గొనాలని కోరారు. జిల్లాలోని గత ప్రమాద గణాంకాలను పరిశీలించి అత్యధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను అంటే బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, అక్కడ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. పౌరుల ప్రాణాల రక్షణే ధ్యేయంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తుందని, ప్రమాద రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు.

# అంబేద్కర్ ఆశయాలను సాధించాలి

**ప్రజాస్వామ్యానికి బాబాసాహెబ్ దిక్సూచి**

**శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి**



**తాండూరు, ఏప్రిల్ 14 (మనసులో మాట):** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా తాండూరు బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే పెద్దదైన భారత ప్రజాస్వామ్యం పదికాలాలు పరిడవిల్లడానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలే కారణమని కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ ప్రచార కమిటీ సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు, 19వ వార్డు కౌన్సిలర్ జుంటుపల్లి వెంకట్, అంబేద్కర్ యువజన సంఘం తాండూరు పట్టణ అధ్యక్షుడు వడ్డె శ్రీనివాస్, వెంకట్ రాములు నాయక్, మల్లికార్జున్, దేవగారి రమేష్, బిర్కిట్ రఘు పాల్గొన్నారు.

# పోలీస్ వాహనం ఢీకొని ఏఎస్ఐ మృతి

**మనూర్ స్టేషన్ వద్దే ఘోరం**




**సంగారెడ్డి, ఏప్రిల్ 14 (మనసులో మాట):** సంగారెడ్డి జిల్లా మనూర్ మండల కేంద్రంలో ఘోర ప్రమాదం జరిగింది. పోలీస్ స్టేషన్ ఎదుట నిలబడి ఉన్న ఏఎస్ఐ గోవింద్ నాయక్ పైకి పోలీస్ వాహనమే దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి సిబ్బంది వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గోవింద్ ప్రాణాలు కోల్పోయారు.

### హత్య అనే అనుమానాలు

ఏఎస్ఐ మరణం ఇప్పుడు పలు అనుమానాలకు దారితీస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనం నడిపిన హోంగార్డు రామారావు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవింద్ పై పాత కక్షతోనే హోంగార్డు కావాలని వాహనంతో ఢీకొట్టి హత్య చేశాడని ఆరోపిస్తున్నారు. ఏఎస్ఐ మృతిపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

# రాజ్యాంగంతోనే అందరికీ సమాన హక్కులు

**తమిళనాడులో అంబేద్కర్ జయంతి వేడుకలు**

**విగ్రహానికి నివాళులర్పించిన మధు యాష్కిగౌడ్**



**ఎల్బీనగర్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని తమిళనాడులోని రాణి పేట జిల్లా కేంద్రంలో ఘనంగా వేడుకలు జరిగాయి. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కిగౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా డీసీసీ అధ్యక్షులు నరేష్ కుమార్ తో కలిసి ఆయన బాబాసాహెబ్ కు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మధు యాష్కిగౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగ రచన ద్వారా దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కల్పించిన మహనీయులు అంబేద్కర్ అని కొనియాడారు. దేశ ప్రజలందరూ ఐక్యంగా ఉండేందుకు ఆయన అందించిన రాజ్యాంగమే దిక్సూచిగా నిలుస్తోందని పేర్కొన్నారు. బాబాసాహెబ్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే అసలైన గౌరవమని తెలిపారు. పౌరులందరికీ న్యాయం జరిగేలా అంబేద్కర్ అప్పట్లోనే ముందుచూపుతో రాజ్యాంగాన్ని రూపొందించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ కాంగ్రెస్

- రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన
- బీజేపీ కంటే కాంగ్రెస్‌కే ఘనమైన చరిత్ర
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం, ఏప్రిల్ 14 (మనసులో మాట):** దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ కాంగ్రెస్ లో మనమంతా పని చేయడం అదృష్టమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ దేశానికి కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందని ఉదహరించారు. దేశంలో ఏ పార్టీకి ఇంతటి ఘన చరిత్ర లేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని జెడ్ పీ సర్కిల్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి భట్టి విక్రమార్క, మహేష్ కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు. అనంతరం భారీ ర్యాలీగా కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు.

## సంక్షేమ పథకాలపై విపక్షాల కుట్ర

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ నేడు దేశాన్ని ఏలుతున్న బీజేపీ కూడా కాంగ్రెస్ తర్వాతే వచ్చిందని ప్రస్తావించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుంటే.. ఆ మేలు జరగకూడదని విపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆగ్రహించారు. పేదలకు ఇళ్లు దక్కకూడదనే లక్ష్యంతో విపక్ష నేతలు దుర్మార్గమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## మహిళా సాధికారతకు పెద్దపీట

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బలోపేతానికి అందరం ఐక్యంగా కృషి చేద్దామని భట్టి విక్రమార్క సూచించారు. మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. కాంగ్రెస్ పై విపక్ష నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని కాపాడుకునేందుకు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారని ప్రశంసించారు. పార్టీ కోసం అంకితభావంతో పని చేద్దామని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వాళ్లకు తప్పకుండా గుర్తింపు దక్కుతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి

- కుల వ్యవస్థ రద్దుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- అంబేద్కర్ జయంతి సభలో సీపీఐ నేత ఆందోజు రవీంద్ర చారి



**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 14 (మనసులో మాట):** భారత దేశంలో అణగారిన వర్గాల కొరకు బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన త్యాగాలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 3 భూ పోరాట కేంద్రంలో జరిగిన ఈ సభకు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ బ్రాహ్మణ ఆధిపత్య భావజాలం, మనుధర్మ శాస్త్రం అమలవుతున్న కాలంలో అంబేద్కర్ ఎన్నో కష్టాలను ఎదుర్కొని చదువుకున్నాం ని తెలిపారు. కనీసం తినడానికి తిండి లేని స్థితి నుంచి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కులం పేరుతో అణగారిన వర్గాలను ఊరికి దూరంగా ఉంచిన సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. చదువు కోసం కుటుంబానికి దూరమై కనీసం తన పిల్లల మరణాలను కూడా కళ్లారా చూడలేని స్థితిని అనుభవించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ అణగారిన ప్రజలకు, పీడిత ప్రజలకు రాజ్యాంగమే రక్షణ కవచమని తెలియజేశారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ, దాని మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ ప్రజల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నాయని రవీంద్ర చారి విమర్శించారు. ఈ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులు, ఆదివాసులు, ముస్లిం మైనార్టీల మీద దాడులు పెరిగాయని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలతో బీజేపీ పనిచేస్తోందని మండిపడ్డారు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ, ఆధిపత్య భావజాలం రద్దు కోసం అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అంటరానితనం రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్ మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, బీఓసీ జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు సైదులు ముదిరాజ్, తైలి మధు, యేశాలి నర్సింహా, కందుల సుధాకర్, గణేష్, పొన్నాల యాదగిరి, పేరాల గోపి, ఆవుల యాదగిరి, వినోద్ నాయక్, వీరేష్, బిచ్చు నాయక్, క్రాంతి, బాల్ రెడ్డి, నాగేశ్వర్, లక్కీ, ప్రియా, శ్రీను, అన్నపూర్ణ, అశోక్, శోభన్, కావేరి, రాణి, రవళి, వీణ, సంధ్య, మమత తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ విలువలకే ప్రాధాన్యం

**మహిళలకు రూ.30 కోట్ల వడ్డీ లేని రుణాలు**

**జయంతి వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు, విప్ విజయ రమణారావు**

**పెద్దపల్లి, ఏప్రిల్ 14 (మనసులో మాట):** రాజ్యాంగ విలువల పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పట్టణంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద నిర్వహించిన అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొని బాబాసాహెబ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.

## యువత కోసం నాలెడ్జ్ సెంటర్

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను అందించిన మహానుభావుడని కొనియాడారు. అంబేద్కర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పెద్దపల్లిలో అంబేద్కర్ స్టడీ సర్కిల్, కమ్యూనిటీ హాల్ తో కూడిన నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని తెలిపారు. దీనికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని వివరించారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారత కోసం నియోజకవర్గంలో రూ.25 నుంచి 30 కోట్ల వరకు వడ్డీ లేని రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ విజయ రమణారావు మాట్లాడుతూ ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని అంబేద్కర్ రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ బాట



- రాజ్యాంగంతోనే సామాన్యులకు స్వేచ్ఛ
- హయత్‌నగర్‌లో ఘనంగా బాబాసాహెబ్ జయంతి
- పీడిత వర్గాల హక్కుల రక్షణే సీపీఐ లక్ష్యం
- శేఖర్ రెడ్డి నివాళి.. పార్టీ శ్రేణుల భాగస్వామ్యం

**ఎల్బీనగర్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను హయత్‌నగర్ మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సమానత్వం కోసం బాబాసాహెబ్ చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లే నేడు సామాన్యులకు సైతం స్వేచ్ఛగా బతికే హక్కు దక్కుతోందని గుర్తుచేశారు. అంబేద్కర్ కన్న కలలను సాకారం చేస్తూ పీడిత వర్గాల హక్కుల రక్షణ కోసం ఎర్రజెండా అలుపెరగని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శి కర్నె సుజాత, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మండల కార్యదర్శి కొప్పుల సరిత, ఎషమల్ల మమత, చెంది వెంకట్, సౌజన్య, సుమతి, యమున, సుజాత, కళ్యాణి, పద్మ, కృష్ణలీల, శిరీష, శిల్ప, చంటి, రామకృష్ణ, బాలరాజు, వెంకట్, ఉపేందర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యనే ఆయుధంగా అంబేద్కర్ ఆశయ సాధన



- బహుజన బాంధవుడు బాబాసాహెబ్: జక్కిడి రఘువీర్ రెడ్డి
- దళిత బంధును కాంగ్రెస్ నిర్వీర్యం చేసింది
- అత్యంత ఎత్తైన విగ్రహం కేసీఆర్ కృషికి నిదర్శనం
- అంబేద్కర్‌ను గౌరవించలేని స్థితిలో రేవంత్ సర్కార్
- మహిళల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు
- సమానత్వం కోసమే బాబాసాహెబ్ నిరంతర కృషి

**ఎల్బీనగర్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన మహానుభావుడు, భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి మన్సూరాబాద్, లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలలో పలు వేడుకలలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

### దళిత బంధుపై నిర్లక్ష్యం

ఈ సందర్భంగా జక్కిడి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి దళితులకు 10 లక్షల రూపాయలు అందించారని గుర్తు చేశారు. వారి అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి దళితులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని మన హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినా, కనీసం దానికి గౌరవప్రదంగా నివాళులు అర్పించలేని దయనీయ పరిస్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు.

### విద్యతోనే సామాజిక న్యాయం

విద్యనే ఆయుధంగా తీసుకుని సమాజంలో సమానత్వం నెలకొల్పాలని సంకల్పించిన అంబేద్కర్ కృషి అపారమైనదని రఘువీర్ రెడ్డి కొనియాడారు. దళితుల సాధికారత, మహిళల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం శ్రమించారని తెలిపారు. ఆయన చూపిన మార్గం నేటికీ కోట్ల మందికి స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. అలాంటి మహానేత ఆశయాల సాధనలో మనమందరం కట్టుబడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీరన్న గుట్ట అధ్యక్షుడు నరసింహ యాదవ్, కార్యదర్శి కోటయ్య, దళిత సంఘాల నాయకులు, వివిధ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# మహిళా కోటా వెంటనే అమలు చేయాలి

- డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం సరికాదు
- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు
- ఆర్థిక వృద్ధి ఆధారంగానే సీట్ల పెంపు
- అఖిలపక్ష భేటీతో ఏకాభిప్రాయం సాధించాలి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌ను ముడిపెట్టవద్దని ఆయన కోరారు. లోక్ సభ నియోజకవర్గాల పెంపుపై తక్షణమే అఖిలపక్ష భేటీ నిర్వహించాలని విన్నవించారు. జాతీయ స్థాయిలో విస్తృతమైన చర్చ జరిపి, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని లేఖలో పేర్కొన్నారు.

### దక్షిణాదికి అన్యాయం జరగొద్దు

నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేవలం జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేపడితే దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్ నెపంతో ఆలస్యం చేయవద్దని, వాటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కోటాకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రాల వారీగా అసెంబ్లీ స్థానాల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే దేశమంతా స్వాగతిస్తుందని తెలిపారు.

### ఆర్థిక వృద్ధి ప్రాతిపదికన సీట్ల కేటాయింపు

లోక్ సభలో పెంచాలనుకుంటున్న 272 సీట్ల కేటాయింపుపై సీఎం రేవంత్ ఒక కొత్త నమూనాను ప్రతిపాదించారు. ఇందులో 50 శాతం (136 సీట్లు) జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50 శాతం (136 సీట్లు) రాష్ట్రాల స్థూల ఆర్థిక వృద్ధి రేటు (జీఎస్‌డీపీ) ఆధారంగా పునర్విభజన చేయాలని సూచించారు. కేవలం జనాభానే ప్రామాణికంగా తీసుకుంటే అది కొన్ని పార్టీలకు తాత్కాలికంగా లాభం చేకూర్చవచ్చు కానీ, దీర్ఘకాలంలో దేశానికి నష్టం కలిగిస్తుందని హెచ్చరించారు. పార్టీ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలే ముఖ్యమని, అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని ప్రధానిని కోరారు.

# మండిపోతున్న ఎండలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రాష్ట్రంలోని వివిధ చోట్ల 42 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్ తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో.. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ తో పాటు నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొన్నది.

# ఇంటర్‌లో లక్ష్మీ ప్రసన్న ప్రతిభ

**463 మార్కులతో ఏ గ్రేడ్**

**సంస్కృతంలో 99 మార్కుల రికార్డు**

**మునిపంపుల గ్రామంలో హర్షం**

**యాదాద్రి భువనగిరి జిల్లా, ఏప్రిల్ 14 (మనసులో మాట):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన విద్యార్థిని మామిండ్ల లక్ష్మీ ప్రసన్న ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో ఆమె అత్యుత్తమ మార్కులు సాధించి అందరి ప్రశంసలు పొందింది. లక్ష్మీ ప్రసన్న ఇంగ్లీష్ లో 77, సంస్కృతంలో 99, గణితంలో 72, ఫిజిక్స్ లో 60, కెమిస్ట్రీలో 60 మార్కులు సాధించింది. మొత్తం 463 మార్కులు పొందిన ఆమెకు ఏ గ్రేడ్ లభించింది.



**గ్రామంలో సంబరాలు**

మునిపంపుల గ్రామానికి చెందిన ఈ విద్యార్థిని సాధించిన విజయంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. తల్లిదండ్రులు మామిండ్ల వెంకటేశం, కవిత తమ కుమార్తె సాధించిన ఫలితంపై గర్వం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో చదువుకుంటే ఎవరైనా ఉన్నత ఫలితాలు సాధించవచ్చని ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న తెలిపింది. ఆమె సాధించిన విజయానికి స్థానికులు, గురువులు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# అంబేద్కర్‌కు ఘన నివాళులు

**ఎల్బీనగర్ చౌరస్తాలో అట్టహాసంగా జయంతి**

**ఘనంగా అంజలి ఘటించిన కాంగ్రెస్ శ్రేణులు**

**బాబాసాహెబ్ ఆశయ సాధనకు కదలాలి**

**వేడుకల్లో అంతటి శ్రీనివాస్ గౌడ్, కుంచ సాయికిరణ్ గౌడ్, నరేష్**



**ఎల్బీనగర్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తాలో ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంతటి శ్రీనివాస్ గౌడ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం దేశ పౌరులందరికీ రక్షణ కవచమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుంచ సాయికిరణ్ గౌడ్, నరేష్ పాల్గొని అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు.

# రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

- సీపీఐ నేత బాతరాజు నర్సింహ పిలుపు
- ఘనంగా డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**ఎల్బీనగర్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** భారత కమ్యూనిస్టు పార్టీ సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ పోస్ట్ ఆఫీస్ వద్ద డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా బాతరాజు నర్సింహ కొనియాడారు. దేశానికి ఆయన అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, న్యాయం, స్వేచ్ఛ, సోదరభావం లాంటి విలువలను ఇచ్చిందని వివరించారు. సామాజిక అసమానతలు, అణచివేత, దళితులపై జరుగుతున్న వివక్షలను నిర్మూలించేందుకు అంబేద్కర్ నిరంతరం పోరాటం చేశారని గుర్తుచేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ విద్య, ఉపాధి, రాజకీయ హక్కులు సమానంగా లభించేలా ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ప్రస్తుత కాలంలో కూడా అంబేద్కర్ ఆలోచనలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణను ప్రతి పౌరుడు తమ బాధ్యతగా భావించాలని సూచించారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గాన్ని నేటి యువత అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారగొని ప్రవీణ్ కుమార్ గౌడ్, సీపీఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు గ్యార క్రాంతి కుమార్, రామావత్ సక్రు నాయక్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు మహమ్మద్ ఇస్మాయిల్, ఉష, వర్రె ఇస్తారి, ఏఐఎస్ఎఫ్ సరూర్నగర్ మండల కార్యదర్శి పీ వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమగల్ బస్తీలో బాబాసాహెబ్ జయంతి

**విగ్రహానికి పూలమాలలు వేసిన పలువురు నేతలు**

**అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దామని పిలుపు**

**జెనిగె విష్ణువర్ధన్, నవజీవన్ రెడ్డి అంజలి**

**ఘనంగా నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్లు**



**ఎల్బీనగర్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హయత్ నగర్ లోని అనుమగల్ బస్తీ లో జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ ఉత్సవాల కమిటీ అధ్యక్షులు కాటేపాక శివ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమకారుడు, టీ యూ ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి హాజరయ్యారు. బీ ఎన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీ ప్రసన్న, చెనగోని శ్రీధర్ గౌడ్ తో కలిసి వీరంతా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**ఉత్సాహంగా సాగిన ఉత్సవాలు**

ఈ కార్యక్రమంలో విగ్రహ దాత బోడ నరసింహ, అనుమగల్ బస్తీ కమిటీ అధ్యక్షులు జెనిగె కుమార్, పీ యూ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంతం యాదిరెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కారింగుల నరేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జోర్క రాం ముదిరాజ్, బోడ యాదయ్య బాబాసాహెబ్ కు అంజలి ఘటించారు. గంగని కిషన్, గంగని రాము, గంగని శ్రీను, కోటపాక రమేష్ కుమార్, జెనిగె గిరి, చాగంటి మనోహర్ వేడుకల్లో పాల్గొని విగ్రహానికి నివాళులర్పించారు. అంబేద్కర్ చూపిన బాటలో నడవడమే ఆయనకు ఇచ్చే అసలైన గౌరవమని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.



# సమాజ మార్పునకు విద్యే ఆయుధం

**బాబాసాహెబ్ ఆశయాలను సాధించాలి**

**రాజ్యాంగంతోనే పౌరులందరికీ స్వేచ్ఛ**

**అంబేద్కర్ జయంతి వేడుకల్లో తుంగతుర్తి రవి**

**పీర్జాదిగూడ, ఏప్రిల్ 14 (మనసులో మాట):** భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు పీర్జాదిగూడలో ఘనంగా జరిగాయి. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఆర్వీ ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి పలు కార్యక్రమాల్లో పాల్గొని నివాళులు అర్పించారు. పారామెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని రక్తదాన శిబిరం, టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ బాబాసాహెబ్ దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సామాజిక అసమానతలు, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. దేశ రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని చెప్పారు. విద్యనే ఆయుధంగా తీసుకుని సమాజంలో మార్పు తీసుకురావాలని అంబేద్కర్ ఇచ్చిన సందేశం నేటికీ ఎంతో గొప్పదని పేర్కొన్నారు. శిక్షణ పొందండి, సంఘటితంగా ఉండండి, పోరాడండి అనే నినాదం ప్రతి యువకుడికి మార్గదర్శకమని రవి తెలిపారు. మహిళా సాధికారత, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.